# నాగరికథ

a Telugu short story by అబ్రకదబ్ర

**Genre:** Historic/Science Fiction

**Date:** 20 July 2009

---

జీవితంలో ఏవీ యాధృచ్ఛికంగా జరగవనేవాడు తాతయ్య. 'దేరార్ నో కో-ఇన్సిడెన్సెస్ మనవడా. ఓన్లీ ఛాయిసెస్ – బి అవర్స్, ఆర్ అదర్స్' అనేవాడు ఆంధ్రాంగ్లాలు కలగలిపేసి. ఆయనో పెద్ద పజిల్. గ్రాండ్ ఫాదర్ పారడాక్స్ గురించి మాట్లాడేటప్పుడే ఆయన గురించిన కబురు తెలియటం .. నా ఛాయిస్ మాత్రం కాదు. దేవుడిదేమో.

* * * * * * * *

'మీ దగ్గరో టైమ్ మెషీన్ ఉంది. దాన్లో మీరు కాలంలో డెబ్భయ్యేళ్లు వెనక్కెళ్లి మీ తాతగారు చిన్నపిల్లాడిగా ఉన్నప్పుడే ఆయన్ని చంపేశారనుకుందాం. మీ తాతగారికి అప్పటికి పెళ్లే అవలేదు కాబట్టి మీ నాన్నగారు పుట్టే అవకాశం లేదు. అంటే మీరు పుట్టే అవకాశమూ లేదన్నమాట. అంటే, మీరు కాలంలో వెనక్కెళ్లి మీ తాతగారిని చంపేసే అవకాశమూ లేదు. అంటే, మీ తాతగారు బతికే ఉంటారు, మీ నాన్నగారూ ఉంటారు, మీరూ ఉంటారు. అంటే, మీరు కాలప్రయాణం చేసి మీ తాతగార్ని చంపేసే అవకాశమూ ఉంది. అంటే, .... '

అంతవరకూ చెప్పి ఓ సారి క్లాసంతా కలయజూశాను. ఏమీ అర్ధం కాని తెల్ల ముఖాలు కొన్ని, అంతా అర్ధమనట్లు వెలుగుతున్నవి ఇంకొన్ని, అటూ ఇటూ కాని క్వశ్చన్ మార్క్ ముఖాలు మరికొన్ని.

నెలకోసారి హైస్కూల్ విద్యార్ధులకి గెస్ట్ లెక్చర్లివ్వటం నాకలవాటు. అదే పనిలో ఉన్నానప్పుడు. ఇలాంటి చిన్న చిన్న విశేషాలూ, గమ్మత్తులే సైన్సు పట్ల పిల్లలకి ఆసక్తి పెంచుతాయన్నది నా స్వీయానుభవం.

అర్ధమయినా కాకపోయినా అందరి ముఖాల్లోనూ ఆసక్తి కనిపించటంతో లెక్చర్ కొనసాగించాను. '.. ఇది తెగేది కాదు. ఇన్ఫినైట్ లూప్ అన్నమాట. దీన్నే గ్రాండ్ ఫాదర్ పారడాక్స్ అంటారు. టైమ్‌ట్రావెల్‌లో ఎదురయ్యే ఇలాంటి తిరకాసులు ఇంకొన్నీ ఉన్నాయి. ఉదాహరణకి .... '

సెల్‌ఫోన్ మోగటంతో పాఠం ఆగింది. తాతయ్య గురించిన వార్త.

* * * * * * * *

స్పీకర్లోనుండి సీట్ బెల్ట్ పెట్టుకోమంటున్న అభ్యర్ధనతో ఆలోచనలు తెగాయి. బెల్టు పెట్టుకుంటూ చుట్టూ చూశాను. ప్రధమ తరగతి ప్రయాణీకులు. ఎవరి లోకాల్లో వాళ్లున్నారు. గంభీర వదనాలు. బస్సులూ, రైళ్లలో కనపడే కలుపుగోలుతనమేదీ? విమానమెక్కగానే వేరే లోకం నుండి ఊడిపడ్డామనుకుంటారా!

తాతయ్య మాటలు గుర్తొచ్చాయి. 'దేవతలకి అతీత శక్తులే ఉంటే వాళ్లకి విమానాలతో పనేమిటి?'

విమానం బయల్దేరింది. ఒక్కసారిగా మొదలైన ఇంజన్ల హోరు. గాల్లోకెగురుతుండగా మళ్లీ జ్ఞాపకాలు షురూ – గజిబిజిగా.

కొన్ని నిజాలు నమ్మటం కష్టం. తాతయ్య చెప్పే కథలూ అంతే. అవన్నీ నిజాలే అనేవాడాయన. మిగతా తాతల్లా మనవళ్లకి ఏడు చేపల కథలూ, నీతి కథలూ చెప్పే రకం కాదాయన. 'నీతులు చెప్పటానికి కథలెందుకురా, బైబిలూ భగవద్గీతా ఉండగా' అనేవాడు. ఆయన చెప్పేవన్నీ అసలు సిసలు అడ్వెంచర్ కథలు. అటూ ఇటూగా అన్నిట్లోనూ కథానాయకుడు ఆయనే.

'తాతయ్య' అన్నానని ఆయనేదో పురాతన కాలపు సనాతనవాది అనుకుంటే తప్పులో కాలేసినట్లే. 'పురాతన' వరకూ కాస్త కరెక్టే - ఆయన పురావస్తు శాఖలో ఇంజనీర్‌గా పనిచేశాడు కాబట్టి. సహజంగానే ఆయన కథలన్నీ ఆ నేపధ్యంలోనే ఉండేవి. అవన్నీ తన అనుభవాల్లోనుండే వచ్చాయనేవాడాయన.

ఎరిగినోళ్లు ఆయన అదోరకం మనిషి అనేవాళ్లు. 'ఏం చెబుతాడో అర్ధం కాదు. ఎక్కడ మొదలెట్టి ఎక్కడ తేలతాడో' అంటూ దూరం పారిపోయేవాళ్లు. నాకు మాత్రం ఆయనతో చర్చలు, కబుర్లు వినోదంతో పాటు విజ్ఞానాన్నీ పంచేవి. ప్రతి విషయాన్నీ ఇలాగే ఎందుకు చూడాలి, అలా ఎందుకు చూడకూడదు అని ప్రశ్నించటం నేర్పాయవి. 'ప్రశ్నించే గుణమే లేకుంటే మనమింకా ఆదిమానవులుగానే మిగిలిపోయుండేవాళ్లం. ప్రశ్నే ప్రగతికి తొలిమెట్టు' అనేవాడు.

అయితే, ప్రశ్నించటం నాకు నేర్పాడే కానీ, ఏ ప్రశ్నకీ సూటిగా సమాధానమీయకపోవటం ఆయన స్టైల్. ప్రశ్నలకి బదులు మరిన్ని ప్రశ్నలు. అడిగినదానికి తప్ప మిగతా అన్నిటికీ సమాధానాలు, పనిలో పనిగా బోలెడంత చరిత్ర బోధన - ఇదీ ఆయన పద్ధతి. ఓపిగ్గా వెతుక్కుంటే మన అసలు ప్రశ్నకీ సమాధానం వాటిలో ఎక్కడో దొరుకుతుంది. ఇది నేను పెద్దయ్యాకెప్పుడో అర్ధమైన విషయం.

ఆయన కబుర్లలో అతిశయోక్తుల విషయం తీసేస్తే వాటివల్ల నాకు సైన్స్ మీదా, చరిత్ర మీదా ఆసక్తి పెరిగింది. దాని ఫలితమే నేను క్వాంటమ్ మెకానిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్ విభాగాల్లో పరిశోధనలు చెయ్యటం, బిఎఆర్‌సి లో పనిచేస్తుండటం. అయితే ఎంత ఎదిగినా, విజ్ఞానం సంపాదించినా, చిన్ననాడు ఏర్పడ్డ భావాలు కొన్ని పెద్దయినా వదలవు. నా చిన్నప్పుడు సింధులోయ నాగరికత గురించి ఆయన తనదైన శైలిలో చెప్పిన కబుర్లు విన్నప్పుడు యధాప్రకారం అదీ కట్టుకథే అనుకున్నా, తర్వాత 'ఏమో నిజమే కావచ్చుగా' అన్న భావం మొగ్గతొడిగింది. కాలక్రమేణా నేను చదివిన చదువులు నన్ను మరింత ఊగిసలాట ధోరణిలోకి నెట్టాయి. కొన్నిసార్లు అవన్నీ గాలి కబుర్లే అనిపిస్తే, కొన్ని సార్లు అది సాధ్యమయ్యే పనే అనిపించేది. ఎన్నో సార్లు తాతయ్యని 'నిజం చెప్పు తాతయ్యా. నువ్వు చెప్పింది కథా, నిజంగా నిజమా?' అంటే ఆయన్నుండి ఓ చిలిపి నవ్వే సమాధానంగా వచ్చేది. 'అప్పుడే చెప్పాగా మనవడా. నమ్మితే నమ్ము, లేకుంటే లేదు' అనేవాడు కులాసాగా. ఆధారాల్లేకుండా నమ్మటానికి అదేమన్నా ఆషామాషీ కథా? ఒకరోజు మరింత ఎక్కువగా

బతిమిలాడితే 'నేను పోయాక నీకా రహస్యం తెలిసే ఏర్పాటు చేశాలేరా. అప్పటి దాకా దాన్నో పజిల్‌గానే మిగిలిపోనీ. అలాగైనా ఈ తాతయ్యని రోజూ గుర్తుచేసుకుంటావు' అన్నాడు బోసి నోటితో నవ్వుతూ.

* * * * * * * *

కర్మకాండల హడావిడి అయిపోయాక ఎవరో భద్రంగా తెచ్చి నా చేతికందించారది, 'పెద్దాయన దీన్ని మీకిమ్మని మరీ మరీ చెప్పాడు' అంటూ. మందపాటి ఫోల్డర్. తెరిచి చూస్తే లోపలన్నీ కాగితం ముక్కలు. వివిధ భాషల వార్తా పత్రికలనుండీ, సైన్స్ పత్రికలనుండీ కత్తిరించినవి. వాటిలో అధికం దశాబ్దాల క్రితం నాటివి లాగున్నాయి. కొన్ని పట్టుకుంటేనే చిరిగిపోయేలా జీర్ణావస్థలో ఉన్నాయి. ప్రపంచంలో ఎక్కడెక్కడో పురావస్తు తవ్వకాల్లో బయటపడ్డ వింతలూ, విశేషాలూ, యూఎఫ్‌వోలు, గ్రహాంతరవాసులు, వాటికి సంబంధించిన మిస్టరీలు, వగైరా వార్తల సేకరణది. జాగ్రత్తగా ఒక్కోటీ తీసి చదువుతుంటే తాతయ్య చెప్పిన చిన్ననాటి కథలకి ముడి సరుకెక్కడిదో అర్ధమవసాగింది. నవ్వుకుంటూ ఒకదాని తర్వాత ఒకటి తిరగేస్తుంటే నా దృష్టినాకర్షించిందా శీర్షిక.

'సింధులోయ తవ్వకాల్లో దొరికిన పరీక్షనాళిక'.

నా గుండె వేగం హెచ్చింది. ఇన్నేళ్లుగా నేను ఎదురు చూస్తున్న ఆధారం ఇదేనా? గబగబా చదవటం మొదలు పెట్టాను.

యాభై లైన్లకి మించని చిన్న వ్యాసం అది. చదవటానికి ఎక్కువ సమయం పట్టలేదు. 'పందొమ్మిది వందల యాభై మూడులో ఈజిప్టు గీజా పిరమిడ్ల వద్ద దొరికిన పరీక్ష నాళికల్ని పోలిన వస్తువొకటి నెల రోజుల క్రితం సింధులోయలో జరిపిన తవ్వకాల్లో బయట పడింది. ఆరంగుళాల పొడుగు, అంగుళం మందమూ ఉన్న ఈ నాళిక చిన్నపిల్లలు ఆడుకునే గిలక్కాయని పోలి ఉండటంతో అది బహుశా ఆటబొమ్మై ఉండవచ్చునని పురావస్తు శాస్త్రవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గీజా నాళికలూ, ఇదీ ఒకే ఆకారంలో ఉండటం, వాటి తయారీలో వాడిన అజ్ఞాత పదార్ధం ఒకటే కావటం, కార్బన్ డేటింగ్‌లో అవి కచ్చితంగా ఏ కాలానికి చెందినవో నిర్ధారించలేకపోయినా అవన్నీ ఒకే కాలానికి చెందినవిగా రుజువవ్వటం …. ఇత్యాది కారణాల వల్ల ప్రాచీన ఈజిప్టు, ప్రాచీన సింధులోయ నాగరికతల మధ్య విస్తారంగా వాణిజ్యం జరిగుండేదని పురావస్తు శాస్త్రవేత్తలు, చరిత్రకారులు భావిస్తున్నారు' – ఇదీ వ్యాసం సారాంశం.

నవ్వొచ్చింది నాకు. 'హమ్మ తాతయ్యా. ఇంత బుల్లి వ్యాసం చదివి అంత పెద్ద కథల్లేశావా?' అనుకుంటుంటే ఆ రోజు మా ఇద్దరి మధ్యా జరిగిన ఆసక్తికరమైన సంభాషణ గుర్తొచ్చింది. ఆయన చెప్పిన ఇతర కథలన్నీ ఒకెత్తు. ఇదొక్కటీ ఒకెత్తు. అందుకే ఇప్పటికీ కళ్ల ముందే కదులుతుందానాటి మా సంభాషణ.

* * * * * * * *

ప్రపంచాన్ని తాతయ్య చూసే విధానం విభిన్నంగా ఉండేది. 'పేపర్లలోనూ పుస్తకాల్లోనూ చదివేదే నిజం కాదురా. కళ్లు తెరిచి నీ చుట్టూ చూడు. లోతుగా చూడు. డోన్ట్ జస్ట్ లుక్, సీ' అనేవాడు తరచూ. లుకింగ్‌కీ సీయింగ్‌కీ తేడా అప్పుడు నాకు తెలిసేది కాదు. ఓ సారి అదే మాటన్నా ఆయనతో, నేను ఇంటర్ రెండో ఏడాదిలో ఉండగాననుకుంటా.

చదువుతున్న పుస్తకం పక్కన పెట్టి నాకేసి తిరిగాడాయన. కాసేపు దీక్షగా నన్నే చూసి మళ్లీ పుస్తకం అందుకున్నాడు. ఈజిప్టాలజీ గురించిన పుస్తకమది. ప్రపంచంలో అతి ప్రాచీన నాగరికతలన్నింటి మీదా ఆయన దగ్గర పుస్తకాలున్నాయి.

'గీజా గ్రేట్ పిరమిడ్‌లో ఎన్ని రాళ్లున్నాయో తెలుసా?' అన్నాడు పుస్తకంలోకి చూస్తూ.

'ఊహుఁ' అన్నా నేను. ఆయనెటూ చెప్పేస్తాడని తెలుసు.

'ఒక్కోటీ పాతిక టన్నులదాకా బరువుండేవి సుమారు పాతిక లక్షల రాళ్లు'

'అమ్మో. అన్నే!'

'అవును. నాలుగు వేల ఆరొందలేళ్ల కిందట .. అంత పెద్ద రాళ్లని పగలగొట్టి, అంత కచ్చితంగా చెక్కి, పిరమిడ్ కట్టే చోటికి తరలించటానికి ఏం టెక్నాలజీ ఉండేదనుకున్నావు?'

'ఏమో మరి'

'రాళ్ల కోసం కొండలు పేల్చటానికి డైనమైట్ లేదు. తరలించటానికి క్రేన్లూ, ట్రక్కులూ లేవు. అసలు వాళ్లకప్పుడు ఇనుము కూడా తెలీదు. అంటే కనీసం గునపాల్లాంటివీ లేవన్న మాట'

'మరెలా చేశారు తాతయ్యా?', నాలో కుతూహలం.

'థింక్ ఔట్‌సైడ్ ది బాక్స్', తాతయ్య గుబురు మీసాల వెనకనుండి చిరునవ్వొకటి తొంగి చూసింది. నాకు మాత్రం బాక్సు బయట థింకటం చేతకాలా. నా మౌనాన్ని గమనించి ఆయనే చెప్పాడు.

'అప్పటికి వాళ్ల దగ్గర టెక్నాలజీ లేకపోయినా, అదున్న వేరేవాళ్ల సహాయం తీసుకునుండొచ్చుగా'

'అంటే?'

'గ్రహాంతరవాసులు'

'వాట్?'

'అవునోయ్. పిరమిడ్స్‌ని ఏలియన్స్ కట్టుండొచ్చు కదా'

'ఇదా, థింకింగ్ ఔట్‌సైడ్ ది బాక్స్ అంటే? ఈ ఐడియా చాలా సిల్లీగా ఉంది'

'అయితే సిల్లీగా లేని ఐడియా నువ్వు చెప్పు చూద్దాం'

నా వద్ద సమాధానం లేదు. ఆయనే మళ్లీ మాట్లాడాడు.

'సహేతుకమనిపించే వివరణలన్నీ అసాధ్యాలుగా తేలిపోయినప్పుడు మిగిలింది - అదెంత అసంబద్ధమైనదైనా - సాధ్యమేనంటాడు షెర్లాక్ హొమ్స్'

'??'

'విపరీతమూ, మన నమ్మకాలకి విరుద్ధమూ అనిపించినంత మాత్రాన అన్ని ఐడియాలనీ కొట్టిపారేయకూడదోయ్. మనకి కనిపించనంత మాత్రాన గ్రహాంతరవాసులు లేరని చెప్పకూడదు. మనిషికి అంతుపట్టనివి చాలా ఉన్నాయీ విశ్వంలో'

'మరి దేవుడు లేడనీ నువ్వే చెబుతావుగా. నీకు కనిపించకపోతే ఆయన లేనట్లా?' నేను లా పాయింట్ లాగాను.

తాతయ్య పెద్దగా నవ్వేశాడు. 'దేవుడు లేడని ఎప్పుడూ అన్లేదు నేను. మనం అనుకునే విధంగా ఉండడని మాత్రమే అంటాను. *దేవతలకి అతీంద్రియ శక్తులుంటాయి, హాం ఫట్ అంటూ అన్నిట్నీ ఆటాడించేస్తారు* అనేది తప్పంటాను'

'మరెలా ఉంటారు, దేవుళ్లు?'

'మరోలా కూడా ఉండొచ్చు. ఉదాహరణకి - నువ్వనుకునే దేవతలు, నేననుకునే ఏలియన్స్ ఒక్కళ్లే కావచ్చుగా. మనకన్నా ఉన్నతమైన సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవాళ్లూ, మనకన్నా గొప్ప నాగరికతకి చెందినవాళ్లూ అయ్యుండొచ్చుగా? పురాణాల్లో కూడా ఆధారాలున్నాయి దీని గురించి'

'దేవుళ్లు గ్రహాంతరవాసులనా?'

'అవును. పుష్పక విమానం విషయమే తీసుకో. దేవతలకి అతీత శక్తులే ఉంటే దూర ప్రయాణాలకి విమానాల్లాంటి యంత్రాల అవసరం ఏమిటి?'

'ఏమో'

'కాబట్టి. దేవుళ్లు నిజానికి గ్రహాంతరవాసులు. మనకన్నా బ్రహ్మాండమైన సాంకేతిక పరిజ్ఞానం కలిగినోళ్లు. ఈ మహిమలూ గట్రా తర్వాతి కాలంలో వాళ్లకి మనుషులు ఆపాదించినవి. ఎలా ఉంది నా థీరీ?'

వాదనలో ఆయన్ని బురిడీ కొట్టించగలిగే శక్తి నాకు లేదు. కాలికేస్తే వేలికేసే రకం. కాబట్టి ఆయన దేవుడు ఏలియన్ అన్నా, ఎలక పిల్ల అన్నా ఒప్పేసుకోటం మేలు.

'ఒప్పకుంటా. దేవుళ్లు అత్యున్నత సాంకేతిక విజ్ఞానం కలిగిన గ్రహాంతరవాసులు. ఇంతకీ ఈ పిరమిడ్లు కట్టింది ఏ గ్రహవాసులంటావ్?', దేవుడి చర్చని తెలివిగా దారి మళ్లించాననుకున్నా నేను.

'ఎక్కడివారైనా కావచ్చు. లక్షలకోట్ల కాంతి సంవత్సరాల దూరంలోని ఏ మహాగ్రహ వాసులో కావచ్చు, లేదా ఈ భూమ్మీది బుద్ధి జీవులూ కావచ్చు'

‘కమాన్ తాతయ్యా. మరీ నా చెవిలో పూలు పెట్టేస్తున్నావ్. ఈజిప్షియన్లకి లేని టెక్నాలజీ అదేకాలంలో భూమ్మీద వేరే సివిలైజేషన్లలో ఉందంటావా?’

‘అదే కాలం అని నేనన్నానా? వేరే కాలంలో విరాజిల్లిన సివిలైజేషన్. భవిష్యత్తు తరాల వాళ్లన్న మాట’

‘వాట్?’

‘టైమ్ ట్రావెల్ గురించెప్పుడూ వినలేదా మనవడా? నీ దేవుళ్లు ఓ చోట మాయమై చిటికెలో మరో చోట ప్రత్యక్షమవటానికి వెనకున్న రహస్యం – వాళ్లకి టైమ్ ట్రావెల్ గుట్టు తెలీటమే. భవిష్యత్తులో మానవజాతి సాంకేతికత సైతం కాల ప్రయాణాలు చెయ్యగలిగే స్థాయిలో అభివృద్ధి చెందొచ్చు. వాళ్లు గతంలోకెళ్లి వాళ్ల టెక్నాలజీ వాడి పిరమిడ్ల నిర్మాణానికి సహాయం చేసుండొచ్చు’

‘నాన్సెన్స్ తాతయ్యా. నువ్వు కథలు చెబుతున్నావు’

‘కొత్త ఆలోచన అనేదెప్పుడూ కాకమ్మ కథలానే అనిపిస్తుందిరా. ఒకటి గుర్తు పెట్టుకో .. అభివృద్ధికి ఆలోచనే విత్తనం’

‘నువ్వేమైనా చెప్పు తాతయ్యా. టైమ్ ట్రావెల్ అనేది కథలల్లటానికే. అదెప్పటికీ సాధ్యమయ్యేది కాదు’

‘సరే. అయితే దీనికి సమాధానం చెప్పు. పిరమిడ్ల నిర్మాణంలో వాడిన మోర్టార్ - అంటే సిమెంట్ లాంటి జిగురు పదార్ధం - ఉంది చూశావూ. పిరమిడ్లు అన్ని వేల ఏళ్ళు చెక్కు చెదరకుండా ఉన్నాయంటే ఆ మోర్టారే కారణం. ఇప్పుడు మనం వాడే సిమెంట్లన్నీ దాని గట్టిదనమ్ముందు బలాదూర్. ఆ మోర్టార్ రసాయన సమ్మేళనం నేటి శాస్త్రవేత్తలు డీకోడ్ చెయ్యగలిగారు. కానీ దాన్ని తయారు చేసే పద్ధతి మాత్రం కనుక్కోలేకపోయారు. ఇంత టెక్నాలజీతో ఇప్పుడే చెయ్యలేని పని అప్పట్లో ఎలా చెయ్యగలిగారంటావ్? వాళ్లకి ఎవరో సహాయం చేసుండాలి అనిపించట్లా?’

‘గ్రహాంతరవాసులా లేక టైమ్ ట్రావెలర్సా?’

‘ఎవరైనా కావచ్చు. అది నీ ఊహకే వదిలేస్తున్నా. ఒకవేళ అది టైమ్ ట్రావెలర్స్ పనే ఐతే, ఒక తమాషా జరిగే అవకాశముంది’

‘తమాషానా. ఏంటది?’

‘పిరమిడ్లలో వాడిన మోర్టార్ మీద పరిశోధనలు చేసి వచ్చే యాభయ్యేళ్లలో దాన్నెలా తయారు చెయ్యాలో మన సైంటిస్టులు కనిపెట్టేస్తారనుకుందాం. అదే సమయానికి మరో సైంటిస్టు టైమ్ మెషీనొకటి తయారు చేశాడనుకుందాం. మన మోర్టార్ సైంటిస్టులు, ఆ మోర్టార్ గట్టిదనం ఎంతో పరీక్షించాలనుకుని, టైమ్ మెషీనేసుకుని నాలుగు వేల ఆరొందల సంవత్సరాల వెనక్కెళ్లి – అంటే పిరమిడ్ల నిర్మాణం జరిగే కాలానికన్న మాట – ప్రాచీన ఈజిప్షియన్లకి మోర్టార్ తయారు చెయ్యటం నేర్పించి వచ్చారనుకుందాం. తమాషాగా లేదూ?’

‘తమాషా ఏమో కానీ, తికమకగా ఉంది’

‘ఏమిటా తికమక?’

‘పిరమిడ్లలో వాడిన మోర్టార్‌ని మనవాళ్లు రివర్స్ ఇంజనీర్ చేసి దాని ఫార్ములా కనుక్కుని, గతంలోకెళ్లి ప్రాచీన ఈజిప్షియన్లకి మోర్టార్ తయారు చేయటం నేర్పించారు. అంటే - మనవాళ్లు నేర్పించకపోతే ఈజిప్షియన్స్ మోర్టార్ తయారు చెయ్యగలిగేవాళ్లు కాదు; ఈజిప్షియన్స్ తయారు చెయ్యకపోతే మనవాళ్లు దాన్ని రివర్స్ ఇంజనీర్ చెయ్యగలిగేవాళ్లు కాదు. ఇంతకీ అది చేసే పద్ధతి ఎవరు ముందు కనిపెట్టారు? వాళ్లా లేక వీళ్లా?’

‘గుడ్ క్యాచ్. పట్టుకుంటావో లేదో అనుకున్నా. గుడ్డు ముందా, పిల్ల ముందా లాంటి తిరకాసన్నమాట. దీన్నే క్యాజువాలిటీ పారడాక్స్ అంటారు. టైమ్ ట్రావెల్‌లో ఇలాంటి తిరకాసులు ఇంకా ఉన్నాయి. ఇంటరెస్టింగ్‌గా లేదూ?’

ఈ తిరకాసుల యవ్వారమేదో నాకు సరదాగా అనిపించింది. టైమ్ ట్రావెల్ పట్ల నా ఆసక్తికి అదే నాంది. భవిష్యత్తులో అదే నేను ఫిజిక్స్‌లో పట్టా పొందటానికి దారి తీసింది.

‘ఇదంతా బాగానే ఉంది కానీ, అసలు టైమ్ ట్రావెల్ అనేది కుదిరే పనేనా?’, ఉత్సాహంగా అడిగాను.

‘ఎందుక్కాదురా. రెండొందలేళ్ల క్రితం గాల్లో ప్రయాణం కుదిరే పని అనుకున్నారా ఎవరన్నా? వందేళ్ల క్రితం రోదసిలోకెళ్లటం కుదురే పని అనుకున్నారా? అవన్నీ సాధ్యమైనట్లే ఇదీ సాధ్యమవుతుంది ఏదో నాటికి’

‘ఏమో నాకు నమ్మకం లేదు’

తాతయ్య ముందుకొంగాడు. అటూ ఇటూ చూసి మెల్లిగా ‘నీకో రహస్యం చెప్పనా? ఎవరికీ చెప్పకూడదు’ అన్నాడు. నేను సరేనన్నాక గుసగుసగా చెప్పాడు, ‘నేనూ ఓ సారి టైమ్ ట్రావెల్ చేశానోయ్. అందుకే అంత నమ్మకంగా చెబుతున్నా’.

పగలబడి నవ్వేశా నేను. ‘కొయ్యమాకు తాతయ్యా. నీకన్నీ పరాచికాలే. అసలు టైమ్ మెషీన్ ఎక్కడిది నీకు? అంత పెద్దది ఎవరికీ తెలీకుండా ఎలా తయారు చేశావు?’

తాతయ్య క్షణం పాటు చిన్నబుచ్చుకున్నట్టు ముఖం పెట్టాడు. వెంటనే మళ్లీ మామూలుగా ఐపోతూ చెప్పాడు, ‘టైమ్ మెషీన్ పెద్దగానే ఉండాలని ఎవరు చెప్పారోయ్ నీకు? అసలది యంత్రం కావాల్సిన అవసరమూ లేదు’

‘మరి?’

‘సింగ్యులారిటీ అంటే ఏంటో తెలుసా నీకు?’

‘బ్లాక్ హోల్ కేంద్రంలో ఉండే పరిస్థితేగా? ఫిజిక్స్‌లో చదువుకున్నా. అణుబాంబులు తయారు చేసేది ఈ సింగ్యులారిటీ ఆధారంగానే కదా’

‘యెస్. భారీ నక్షత్రాలు పేలిపోవటాన్ని సూపర్‌నోవా అంటారు. సూపర్‌నోవా కేంద్ర స్థానంలో సూక్ష్మ పరిమాణంలో ఉండే పదార్థాన్ని డార్క్ మ్యాటర్ అంటారు. ఆ డార్క్ మ్యాటర్ చుట్టూ ఆవరించి ఉండేదే సింగ్యులారిటీ. సింగ్యులారిటీ గాఢత కొంత తగ్గించి బ్లాక్ హోల్ బదులు మైక్రోస్కోపిక్ వర్మ్‌హోల్ – అంటే అతి సూక్ష్మ మైన కాలబిలం - ఒకటి సృష్టిస్తే దానిద్వారా కాలంలో ముందుకీ వెనక్కీ ప్రయాణించొచ్చు. ఐన్‌స్టీన్ సాధారణ సాపేక్ష సిద్ధాంతం చెప్పే విషయమే ఇది’

‘ఒకే. ఐతే ఏంటట?’

‘పందొమ్మిదొందల యాభైల్లో నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో ఫీల్డ్ వర్క్ కోసం ఈజిప్ట్ వెళ్లానా? అక్కడ పిరమిడ్లలో నాక్కొన్ని సీల్డ్ టెస్ట్ ట్యూబ్స్ లాంటివి దొరికాయి. ఏదో వింత పదార్ధంతో తయారు చేసినట్లున్నాయి. ప్రాచీన కాలంలో పిల్లలాడుకునే గిలక్కాయల్లాంటివి కావచ్చు. న్యాయంగా అయితే అవన్నీ ఈజిప్షియన్ ప్రభుత్వానికి అప్పగించాలి. ఆసక్తి కొద్దీ వాటిలో ఒకటి దొంగతనంగా ఇండియా తీసుకొచ్చి నా స్నేహితుడు ఫిజిక్స్ ప్రొఫెసర్ ఒకడుంటే వాడికిచ్చా - దాన్ని తయారు చేసిన మెటీరియల్ ఏంటో కనుక్కోమని. వాడు దాని మీదేవో ప్రయోగాలు, పరిశోధనలు చేస్తే మేం ఊహించనిదొకటి బయటపడింది’

‘లెట్ మి గెస్ .... ఆ మెటీరియల్ పేరే గ్రహమ్మీదది అనే కదా. రైటేనా?’

‘రాంగ్. ఆ పరీక్ష నాళికలో అణుమాత్రంగా మిగిలున్న డార్క్ మ్యాటర్’

‘డార్క్ మ్యాటరా?’

‘అవును. అదెక్కడి నుండొచ్చిందీ తెలీదు కానీ, సరిగా వాడితే దానితో వర్మ్‌హోల్స్ సృష్టించొచ్చు. కాలంలో ప్రయాణాలూ చెయ్యొచ్చు’

‘అంటే, కాలప్రయాణీకులెవరో దాన్ని పిరమిడ్లలో పోగొట్టుకుంటే మీకు దొరికిందన్న మాట’

‘ఎగ్జాక్ట్‌లీ. దాన్ని వాడే మేమూ టైమ్ ట్రావెల్ చేశాం. నేనూ, నా స్నేహితుడూ’.

తాతయ్య చెప్పేదంతా కట్టుకథేనని తెలుసు. ఓ పక్క నవ్వొస్తుంది. ఐనా ఆయన ముందు ముందు ఏం చెప్పబోతున్నాడో అన్న ఆసక్తీ ఉంది. అందుకే నవ్వాపుకుంటూ అన్నా.

‘ఇంట్రెస్టింగ్ తాతయ్యా. ఎక్కడికెళ్లారేంటి కాలంలో?’

‘సింధులోయకి. ఇండస్ వ్యాలీ సివిలైజేషన్ వర్ధిల్లుతున్న రోజులకి’

‘అప్పటికే ఎందుకు?’

‘అది ఎందుకు అంతరించిపోయిందో చెప్ప చూద్దాం’

‘ఆర్యుల దండయాత్రలనీ, సింధు నది వరదలనీ, ఘాగర్-హక్రా నది దిశ మార్చుకోటం వల్లనీ, భూకంపాల నుండనీ .. రకరకాల కారణాలు చెబుతారు. ఏది నిజమో మరి’

‘మిగతావన్నీ ఈ మధ్య - ఇరవై ముప్పై ఏళ్ల కిందట ప్రతిపాదించిన సిద్ధాంతాలు. పందొమ్మిదొందల యాభై మూడు ప్రాంతంలో మావాళ్లకి తెలిసింది ఆర్యుల దండయాత్ర సిద్ధాంతం ఒకటే. అదెంతవరకూ నిజమో కనుక్కుందామనే మేం ఆ కాలానికెళ్లాం’

నాకు ఆసక్తి పెరిగింది. కథ వినటంలో లీనమైపోయానిక.

‘వర్మ్‌హోల్ గుండా చిటికెలో వెనక్కి ప్రయాణించి క్రీస్తు పూర్వం పదిహేను వందల ఏళ్ల ప్రాంతానికి వెళ్లాం. సింధు లోయ నాగరికత వెలుగులు చూసి అదిరిపోయాం. దాని గురించి మనం పుస్తకాల్లో చదువుకున్నది అసలుదాని ముందు ఎందుకూ కొరగాదు. సింధు నది, దానికి సమాంతరంగా ఘాగర్-హక్రా నది. ఆహ్. ఏం నదుల్రా అవి! మన కృష్ణా, గోదావరీ వాటి ముందు పిల్ల కాలవలే. ఆ రెండు నదుల మధ్యలో వందలాది పట్టణాలు, పల్లెలు. అప్పట్లోనే కొన్ని నగరాల్లో యాభై అరవై వేలకి తగ్గని జనాభా. ఆ నగరాలు, వాటి ప్లానింగ్ చూసి తీరాల్సిందే. ఆ నాటి ఇంజనీర్ల గొప్పదనం గురించి నేటి చరిత్రకారులు గొప్పగా చెబుతుంటారు కానీ, నిజానికి వాళ్ల గొప్పదనంలో మనమెరిగింది పది శాతమే. సిటీ ప్లానింగ్ అంటే వాళ్లనుండే నేర్చుకోవాలి. అన్నిట్లోకీ చెప్పాల్సింది సింధు నదిపై వాళ్లు కడుతున్న బ్రహ్మాండమైన ఆనకట్ట గురించి. అసలు గ్రేట్ పిరమిడ్ ఎందుకు పనికొస్తుంది దాని ముందు. ఆ కాలంలోనే అంత భారీ కట్టడం! మనదేశంలో ఇప్పుడున్న డ్యామ్స్ అన్నీ దానిముందు దిగదుడుపే ….’, తాతయ్య కళ్లుమూసుకుని పరవశంగా చెప్పుకుపోతున్నాడు. ఆ తన్మయత్వం చూస్తే ఆయన నిజంగానే అవన్నీ చూశాడా అన్న అనుమానమొచ్చింది నాకు. ఆయన్నాపకపోతే ఆగేలా లేడు.

‘వెయిట్ తాతయ్యా. సింధు నాగరికతలో భారీ ఆనకట్టలేవీ ఉన్నట్లు వినలేదే’ అన్నాను ప్రవాహాన్నాపుతూ.

‘ప్రశ్నలెయ్యకుండా విను. దానికీ సమాధానం చెబుతాగా’ అని కోరగా నాకేసి చూసి కొనసాగించాడాయన. ‘సింధులోయలో చివరి మజిలీగా ఆ డ్యామ్ వద్ద ఆగాం. దాని భారీ పరిమాణానికీ; క్రేన్లూ, ప్రొక్లైన్లూ లాంటివి లేకుండానే దాన్ని కడుతున్న వాళ్ల నైపుణ్యానికీ ఆశ్చర్యపోయాం. ఇక తిరిగొచ్చేసే సమయమయింది. అయితే అర్ధం కాని విషయం మాత్రం ఒకటి అలాగే మిగిలిపోయింది’

‘ఏంటది?’

‘మన లెక్కల ప్రకారం మేం వెళ్లేటప్పటికి ఆ నాగరికత అవసాన దశలో ఉండాలి. కానీ అలాంటి సూచనలేవీ కనపడలేదక్కడ. ఆర్యుల ఆనవాళ్లు లేవు, దండయాత్రల దాఖలాలూ లేవు’

‘అవునా?’

‘అవును. మొత్తానికి, మేం ఏ నిజం కనుక్కుందామని వెళ్లామో అది మాత్రం మాకు తెలియలా. నిరాశగా వెనక్కి తిరిగి వచ్చేయబోతుండగా జరిగిందది. మేం ఏ మాత్రమూ ఊహించనిది!’

‘ఏం జరిగింది?’, నాలో ఉత్సుకత.

‘తిరుగు ప్రయాణం నిమిత్తం వర్మ్‌హోల్ సృష్టించే ప్రయత్నంలో మావాడు గందరగోళానికి గురై దానిమీద నియంత్రణ కోల్పోయాడు. అవసరమైనదానికన్నా ఎక్కువ శక్తివంతమైన వర్మ్‌హోల్ చేసేశాడు. దానిగుండా మేమైతే మా కాలంలోకి తిరిగి రాగలిగాం కానీ, మేమిలా దాటేశామో లేదో అక్కడో చిన్నపాటి అణు విస్ఫోటనం జరిగింది. దాని దెబ్బకి ఆనకట్ట తునాతునకలైపోయింది. జలాశయం నుండి ఒక్కుదుటన విడుదలైన నీరు వంద సునామీల పెట్టున సింధు నది పొడుగునా ఉన్న నగరాలనీ, గ్రామాలనీ ముంచెత్తింది’

‘వ్వాట్‌??’ అదిరిపడ్డా నేను. ఇది నేనూహించని ట్విస్టు.

‘అంతే కాదు. ఆ విస్ఫోటనం ధాటికి ఒకదాని వెంబడి ఒకటి చైన్ రియాక్షన్‌లా భూకంపాలు విరుచుకుపడి ఆ ప్రాంతాన్నంతా కుదిపేశాయి. వాటి దెబ్బకి ఘాగర్-హక్రా నది ఉన్నపళాన దిశ మార్చేసుకుంది. కాలబిలంలో కూర్చుని వెనక జరుగుతున్న వినాశనం, విధ్వంసం చూస్తూ మేం చెప్పలేనంత షాక్‌కి గురయ్యాం.’

‘!!!!’

‘ఇప్పడర్ధమయిందా, సింధు లోయ నాగరికత ఎలా అంతరించిందో?’

‘పూర్తిగా. మా తాతయ్యా, ఆయన ఫ్రెండూ వెళ్లి నాశనం చేసేశారు. మీరు వెళ్లకపోతే అది నాశనమయ్యేది కాదు, నాశనమవకపోతే మీరు వెళ్లేవారు కాదు. క్యాజువాలిటీ పారడాక్స్ అన్నమాట. మొత్తానికి ఆర్యుల దండయాత్ర వల్ల మాత్రం అంతరించలేదంటారు’

‘ఆర్యుల దండయాత్రా ఓ కారణమేనోయ్. నిజానికి, అదే అసలు కారణం. ఆ ఆర్యులెవరో కాదు - మేమిద్దరమే’ తాతయ్య కన్నుగీటి చెప్పాడు. ‘అదీ సంగతి. మేం వెళ్లేనాటికి లేని భూకంపాలు, వరదల సిద్ధాంతం ఆ తర్వాత పుట్టుకు రావటానికి కారణమూ అదే. ఎవరికీ చెప్పొద్దీ విషయం. ఇది మనిద్దరి రహస్యం’

‘చెప్పినా ఎవరు నమ్ముతారు, నా ముఖానే నవ్వుతారు’ అనుకుంటూ చివరిగా ఓ ప్రశ్నడిగా.  ‘ఎవరికీ చెప్పన్లే కానీ, మరి మీరు మళ్లీ వెనక్కెళ్లి ఆ ఘోరం జరక్కుండా ఆపుండొచ్చు కదా’

ఆయన గాఢంగా నిట్టూర్చి శూన్యంలోకి చూస్తూ చెప్పాడు, ‘ఎలా వెళ్తాం? ఆ గందరగోళంలో డార్క్ మ్యాటర్ ఉన్న నాళిక అక్కడే పోగొట్టుకుని వచ్చాంగా’

* * * * * * * *

‘నేను పోయాక నీకా రహస్యం తెలిసే ఏర్పాటు చేశాలేరా’ అంటున్న తాతయ్య ముఖమే కళ్లలో మెదులుతుండగా ఆ పేపర్ కటింగ్‌ని భద్రంగా మడత పెట్టసాగాను. చిన్న వ్యాసం ఆధారంగా చిలవలు పలవలుగా ఓ కథల్లేసిన తాతయ్య ఊహాశక్తికి ఆశ్చర్యపోయాను. వింతగా, నిజం ఏమిటో తెలిసిపోయేసరికి ఉసూరుమనిపించింది. కొన్ని నిజాలు నమ్మటం కష్టం. ముఖ్యంగా - అవి ఇంత సాదాసీదాగా ఉంటాయని తెలిస్తే. తాతయ్య టైమ్ ట్రావెల్  కథ నిజమే అయ్యుండాలని లోలోపలెక్కడో గట్టిగా కోరుకున్నానా నేను?

అంతలో నా దృష్టి యధాలాపంగా ఆ పేపరు ముక్కకి వెనకున్న సినిమా ప్రకటన మీద పడింది. హాలీవుడ్ సినిమా ‘మమ్మీ రిటర్న్స్’ ప్రకటన.

నా భృకుటి ముడిపడింది.

‘ఆర్కియాలజీ’ మేగజైన్ లోనుండి సేకరించిన కాగితం అది. ఆ పత్రికలో మమ్మీ, ఇండియానా జోన్స్ వంటి సినిమాల ప్రకటనలు రావటం వింతేమీ కాదు. అది కాదు నేను ఆలోచిస్తుంది.

మమ్మీ రిటర్న్స్ విడుదలయింది ఎనిమిదేళ్ల క్రితం. తాతయ్య నాకా కథ చెప్పి ఇరవయ్యేళ్ల పైమాటే.

అంటే .. !?!

(THE END)